క్లుప్తంగా

సత్తెమ్మతల్లికి ఘనంగా పూజలు



సత్తెమ్మతల్లికి పూజలు చేస్తున్న కోమటి శ్రీనివాసరావు దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు కాపు జగ్గరాజుపేట శివారు సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. 87వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు పాల్గొని అభిషేకాలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నమ్మి తాతారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయ వార్షికోత్సవం నేడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఈ. బోనంగి ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ గ్రామదేవత పోలమాంబ ఆలయ 12వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. అమ్మవారికి విశేష పూజలతో పాటు సారె ఊరేగింపు భారీ స్థాయిలో నిర్వహించనున్నామని కమిటీ ప్రతినిధి మంత్రి గిరి ప్రసాద్ తెలిపారు.

210 మందికి ఉచిత వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో శుక్రవారం శ్రీ సత్య మెడికల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 210 మందికి వైద్య సేవలు నిర్వహించారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సత్య సాయి మెడికల్ వైద్యులు డాక్టర్ రాము, భవాని శంకర్, స్థానిక నాయకులు అచ్చిబాబు, మజ్జి రాజు, కె.హరి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు వసతులు కల్పించాలని వినతి



జెడ్సీకి వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక: స్థానిక భానోజీతోటలోని టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పర్చాలని సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, అప్పలరాజు ఉన్నారు.

ఘనంగా తుంపాలమ్మ ఆలయ వార్షికోత్సవం

గాజువాక: స్థానిక సింహగిరి కాలనీలోని తుంపాలమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. అర్చకుడు ఆరవెల్లి గణేష్ వర్మ పర్యవేక్షణలో కుంకుమార్చన, శాంతిహోమం, పంచామృతాభిషేకం, నీరాజన మంత్రపుష్పం వంటి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బొడ్డేడ వెంకటరమణ, రాఘవమ్మ దంపతుల తొలిపూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. సింహగిరి కాలనీ, అంబేడ్కర్ కాలనీ, వియ్యపువానిపాలెం, సనత్‌నగర్ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వందే భారత్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వందే భారత్‌కు హాల్ట్ ఇవ్వాలని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే అధికారులను విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ – విశాఖ మధ్య నడుస్తున్న వందే భారత్‌కు విశాఖ పారిశ్రామిక ప్రాంత ప్రయాణికులకు అనువుగా ఉన్న దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని కోరారు. దీని వల్ల వేలాది మంది ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

గాజువాక.. కెవ్వు కేక



గాజువాక మెయిన్ రోడ్‌లో యాక్సెసరీస్ దుకాణం

ఎన్ని షోరూమ్‌లు, షాపింగ్ మాళ్లు వచ్చినా రోడ్డు పక్క దుకాణాలకు ఆదరణ తగ్గలేదు. షాపింగ్ మాళ్లలో లభించే విభిన్న వస్త్రాలు రోడ్డుపక్కనే దొరుకుతాయి. ట్రెండ్‌కు తగ్గట్టుగా, యువతను ఆకట్టుకొనేలా వివిధ డిజైన్లలో రెడీమేడ్ దుస్తులు అందుబాటులో ఉంటాయి. ఇవి మాత్రమే కాదు.. విభిన్నమైన వస్తువులు, గాడ్జెట్లు కూడా రోడ్డు పక్కన దుకాణాల్లో లభిస్తాయి. ఒక్కసారి గాజువాక మెయిన్‌రోడ్డులోకి అడుగు పెడితే కావాల్సిన వస్తువులన్నీ లభించడంతో గాజువాక.. కెవ్వుకేక.. అంటున్నారు వినియోగదారులు. – గాజువాక



పాతగాజువాక సమీపంలో వాచీలు, కళ్లద్దాల షాపులు

- బ్రాండెడ్ షోరూమ్స్‌కు దీటుగా ఫుట్‌పాత్ దుకాణాలు
- రెడీమేడ్ దుస్తులతో పాటు గాడ్జెట్‌లు కూడా లభ్యం
- వందలాది కుటుంబాలకు జీవనాధారం



కొత్తగాజువాకలోని ఫుట్‌పాత్‌పై వస్త్ర దుకాణాలు



రోడ్ మార్జిన్‌లో గాజుల బండి



ఫొటోలు: శీలం శ్యాం

గాజువాకలో రోడ్డు పక్క వ్యాపారాలకు మంచి ఆదరణ లభిస్తోంది. పెద్దపెద్ద షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్‌తో సమానంగా రోడ్డు పక్కన దుకాణాల వ్యాపారాలు నిత్యం పచ్చతోరణంగా వికసిస్తున్నాయి. చిరు వ్యాపారులు కోల్‌కతా, చెన్నై, ఢిల్లీ, రాజస్థాన్, ముంబైవంటి ప్రాంతాల నుంచి రెడీమేడ్ దుస్తులు తెచ్చి అమ్మకాలు సాగిస్తూ వందలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. దీంతో ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేవరకూ జనాలతో రోడ్లు రద్దీగా మారుతాయి.

పోటాపోటీగా వ్యాపారాలు

కొత్త గాజువాక నుంచి పాతగాజువాక వరకూ మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్ వ్యాపారాలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కోస్తా ప్రాంతంలోని పలు జిల్లాలకు చెందిన వారు ఇక్కడికి వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. కేవలం రెడీమేడ్ దుస్తులు విక్రయించే ఫుట్‌పాత్ వస్త్ర దుకాణాలే ఇక్కడ 150కి పైగా ఉన్నాయి. వాటి ద్వారా ప్రతిరోజు సగటున ఐదారు లక్షల రూపాయల వ్యాపారం సాగుతున్నట్టు అంచనా. సీజన్‌లో ఈ వ్యాపారం రెండు రెట్లు అదనంగా సాగుతుంది. అన్ సీజన్‌లో కేవలం రెడీమేడ్ వస్త్ర దుకాణాల ద్వారా ప్రతి నెలా రూ.2 కోట్ల టర్నోవర్ సాగిస్తున్నట్టు చెబుతున్నారు. లెదర్ బెల్టులు, సండే బజారు పేరుతో ఏర్పాటవుతున్న దుకాణాలు, వివిధ యాక్సెసరీస్ వ్యాపారం వీటికి అదనం.

ప్రజల అభిరుచికి తగ్గట్టుగా..

బీహెచ్‌పీవీ, ఆటోనగర్, విశాఖ స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డు, పరవాడ ఎన్‌టీపీసీ, హిందూజా విద్యుత్ పరిశ్రమలు, ఫార్మాసిటీ పరిశ్రమలు, గంగవరం పోర్టు, అచ్యుతాపురం, దువ్వాడ ఎస్ఈజెడ్‌లకు గాజువాక చేరువగా ఉండడంతో అంతా ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గాజువాక జనాభా ఏటికేడాది లక్షల సంఖ్యలో పెరుగుతుండడంతో వ్యాపారాలు వృద్ధి చెందుతున్నాయి. విభిన్న వయసులు, ప్రాంతాల వారి అభిరుచికి తగ్గట్టుగా వ్యాపారులు వస్త్రాలు, వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉంచుతున్నారు. గాజువాక మెయిన్ రోడ్ మార్జిన్‌లో ఏర్పాటైన వివిధ దుకాణాలు షాపింగ్ మాళ్లను మరిపించే స్థాయిలో డిజైన్లను అందుబాటులో ఉంచుతున్నాయనడం అతిశయోక్తి కాదు.

పర్మినెంట్ కస్టమర్లు



మా వద్ద అన్ని రకాల దుస్తులు సరసమైన ధరలకే కస్టమర్లకు అందజేస్తాం. చిన్న చిన్న ఉద్యోగాలు చేసేవారు, అల్పాదాయవర్గాల కస్టమర్లు మావద్దకు వచ్చి కొనుగోలు చేస్తారు. ఒకసారి వచ్చిన కస్టమర్లు మళ్లీ మళ్లీ వచ్చి దుస్తులు కొంటారు. వారి నమ్మకాన్ని పొందే విధంగా మేం దుస్తులు అందిస్తాం.

– డి.కనకారావు, వ్యాపారి

25 ఏళ్లుగా ఇదే వ్యాపారం



నేను విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచి ఇక్కడికి వచ్చాను. పాతికేళ్లుగా ఇక్కడే దుస్తులు విక్రయిస్తున్నాను. ఇంతకాలం వ్యాపారం బాగానే నడిచింది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో అన్నీ దొరుకుతున్నాయి. దీంతో వ్యాపారంలో సవాళ్లు తప్పడంలేదు.

– మజ్జి భగవతిరావు, వ్యాపారి

ప్రభుత్వాలు ఆదుకోవాలి



మాలాంటి వ్యాపారులను ప్రభుత్వాలు ఆదుకోవాలి. వ్యాపారాలను పెంచుకోవడం కోసం పెట్టుబడి కావాలంటే అప్పులు చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలు కనికరిస్తే మేం కూడా వ్యాపారాలను పెంచుకుంటాం. 30 ఏళ్లుగా నేను ఈ వ్యాపారం చేస్తున్నాను. పెట్టుబడి పెద్దగా లేకపోవడంతో ఏరోజు వ్యాపారం ఆరోజే అన్నట్టు నెట్టుకొస్తున్నాను.

– బొత్స సత్యనారాయణ, వ్యాపారి

పిల్లలకు నచ్చే వాచీలు



పిల్లలకు నచ్చే వాచీలను నేను విక్రయిస్తున్నాను. రూ.200 నుంచి రూ.300 లోపు ధరలతో వాచీలతో పాటు ఇతర యాక్సెసరీలు విక్రయిస్తాం. ప్రస్తుతం ఆన్‌లైన్‌కు జనం అలవాటు పడడం వల్ల వ్యాపారం నిలకడగా ఉండటంలేదు. అప్పటికప్పుడు కొనాలనుకునే వారు మావద్దకు వస్తున్నారు.

– ఎస్.వినోద్, గాజువాక

తక్కువ ధరలకే యాక్సెసరీస్



మా వద్ద అన్ని రకాల యాక్సెసరీస్ అందుబాటులో ఉంటాయి. లెదర్ బెల్టులు, టోపీలు, వాచీలు, పర్సులు తక్కువ ధరకే విక్రయిస్తాం. నాణ్యతలో రాజీ ఉండదు. అందుకే మా వద్ద ఒకసారి కొనుగోలు చేసినవారు మళ్లీమళ్లీ వస్తుంటారు. కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా యాక్సెసరీస్ అందుబాటులో ఉంచుతాం.

– పి.మోహన్, వ్యాపారి

పుల్వామా అమరులకు నివాళి

గాజువాక: పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు ఐస్టాండ్ ఫర్ నేషన్, జైభారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో అవయవాన్ని కోల్పోయిన వీర సైనికుడు షేక్ సుభాన్ జాతీయ జెండాను ఆవిష్కరించి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ల ప్రతినిధులు ఆదిల్, జి.టి.వి.రమేష్, వై.వి.శ్రీనివాసరావు, కిశోర్, బాటా శ్రీను, వినోద్‌బాలు పాల్గొన్నారు.

పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు కర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, రంగనాయకులు, అశోక్‌కుమార్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వీర మరణం పొందిన జవాన్లకు నివాళులర్పిస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం ప్రతినిధులు

అమర జవాన్లకు అంజలి

కూర్మన్నపాలెం: పుల్వామా దాడుల్లో అమరులైన భద్రతా సిబ్బందికి నివాళులు అర్పిస్తూ మాజీ సైనికులు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. వారి మృతికి సంతాప సూచికంగా వడ్లపూడి ఆస్పత్రి నుంచి గాంధీ బొమ్మ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేసి జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. నర్సింగ్ సారథ్యం వహించగా 86వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డ గోవింద్, సోమేష్, కె. శ్రీనివాస్, మాజీ సైనికులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అగనంపూడి: 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో వీర జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు , గ్రామ పెద్దలు గురు గోవింద్, గుదే గజేంద్రరావు, జి.కూర్మారావు, వేణు, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి రూ.25వేల సాయం



క్షతగాత్రుని కుటుంబానికి రూ.25వేల నగదు అందిస్తున్న దాతలు

అగనంపూడి: రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న డిప్లమో తృతీయ సంవత్సరం చదువుతున్న అగనంపూడికి చెందిన తలారి శంకరరావు వైద్య ఖర్చుల నిమిత్తం సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామఅప్పారావు మిత్ర బృందం రూ.25 వేల నగదును అందించారు. క్షతగాత్రుని తండ్రి పక్షవాతంతో రెండేళ్ల నుంచి ఇబ్బంది పడుతూ ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ తరుణంలో రోడ్డు ప్రమాదంలో శంకరరావుకు తీవ్ర గాయాలు కావడంతో సగం పుర్రెను తొలగించారు. దీంతో అవయవాలు చచ్చుబడిపోయాయి. విషయం తెలుసుకున్న రామ అప్పారావు తన మిత్రుల వాట్సాప్ గ్రూపులో సమాచారం చేరవేయగా దాతలు స్పందించి మొదటి విడతగా రూ.25వేల నగదును శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా రామఅప్పారావు మాట్లాడుతూ బాధితుడి నిస్సహాయ స్థితిని వివరించగానే మానవత్వంతో స్పందించిన దాతలు డాక్టర్ ఎం.జగన్మోహన్, డాక్టర్ శశికాంత్, విందుల వెంకటరమణ, వంశీ శ్రీనివాస్, తమ్మిన లక్ష్మీనరసింహరావు, బలిరెడ్డి రామకృష్ణ, బండారు చందులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిమ్మకూరి రమేష్, చిత్తా నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థులు ఆకర్షణకు గురి కావొద్దు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: అభం శుభం తెలియని వయసులో ప్రేమ అనే ఆకర్షణకు గురి కావద్దని చేపలపాలెం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ సూచించారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎర్ర గులాబీలతో ప్రేమ చిహ్నం వేసి ప్రేమకు ఎందుకు తొందర, చదువుకో ముందర అంటూ ప్లకార్డులతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శిల్ప, లత తదితరులు పాల్గొన్నారు.

423 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీసులు శుక్రవారం నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కామేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పురస్కరించుకుని నగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు పెదగంట్యాడ మండల పరిధిలో వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా హోసింగ్‌బోర్డు కాలనీలో తనిఖీలు చేపడుతుండగా ప్రసాద్, కొండలరావు అనే ఇద్దరు వ్యక్తులు పీడీఎస్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి 423 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌లో భద్రతపై అవగాహన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో భద్రతా పరమైన అంశాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 54వ జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా పని ప్రదేశాలు, దైనందిన జీవితంలో భద్రత ప్రాముఖ్యతను వివరించడానికి ఏటా దేశవ్యాప్తంగా జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉద్యోగులకు శిక్షణ, భద్రతా ఆడిటింగ్, మాక్ డ్రిల్స్, అగ్నిమాపక ప్రదర్శనలు వంటి కార్యకలాపాలు ఉక్కు ఉద్యోగులకు నిర్వహించనున్నారు. పిల్లలు, ఉద్యోగులు, కార్మికుల్లో భద్రతా స్పృహ పెంపొందించడానికి ఈనెల 16 నుంచి వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. భద్రతా విభాగాధిపతి ఎం.ఎస్.ఎన్.రాజు, విభాగం డీజీఎం ఎం. వరప్రసాదరావు మాట్లాడుతూ భద్రత అనేది జీవితంలో అంతర్భాగంగా ఉండాలని ఆకాంక్షించారు.

వైభవంగా రాములోరి పరస



సీతారామలక్ష్మణ స్వాములను దర్శించుకుంటున్న గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజనజగ్గయ్యపాలెంలో సీతారాముల పరసను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు వేకువ జాము నుంచే ఆలయానికి చేరుకుని సీతారామలక్ష్మణ స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలోని వీధులన్నీ పరసకు వచ్చిన భక్తజన సందోహంతో నిండి పోయాయి. రోడ్లపై ఏర్పాటు చేసిన స్టాళ్ల కొనుగోలు దారులతోకళకళలాడాయి. వీధులన్నీ రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో విరజిల్లాయి. ఆలయం వద్ద సాముగరిడీ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, పారిశ్రామిక వేత్త అట్లూరి రమేష్, కరణం ముత్యాల నాయుడు తదితరులు సీతారామలక్ష్మణ స్వాములను దర్శించుకున్నారు.



స్టాళ్ల వద్ద జనం

ప్రజల్లోకి కేంద్ర పథకాలు

కూర్మన్నపాలెం: బీజేపీ వడ్లపూడి మండల పదాధికారుల సమావేశం శుక్రవారం స్థానిక రామాలయం వద్ద నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు బొండా ఎల్లాజీరావు, శ్రీదేవి, అశోక్, ఎం.బాబేరావు, జైస్వాల్, రాజేశ్వర ప్రసాద్, మహేష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ తెలుగునాడు స్టీల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. యూనియన్ ప్రధానకార్యదర్శి నమ్మి సింహాద్రి, అధ్యక్షులు జి. నరేంద్రకుమార్ శుక్రవారం సీఎండీకి వినతిపత్రం అందజేశారు. ఐదు నెలలుగా జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులను ఉత్పత్తి వైపు ప్రోత్సహించడానికి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

ఆటోస్టాండ్‌కు స్థలం కేటాయించాలని లేఖ

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ పరిధిలో ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ కోసం స్థలం కేటాయించాలని కోరుతూ సౌత్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కర్రి వెంకటరావు శుక్రవారం తూర్పు కోస్తా రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌ను వినతిపత్రంలో కోరారు. దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో 70 ఆటోలు నడుపుతున్నారని.. ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.